క్లుప్తంగా

పరిసరాల శుభ్రతపై అవగాహన

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సచివాలయం-1,2,3 పరిధిలోని ప్రజలకు, విద్యార్థులకు పరిసరాల శుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యసిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. మూడో సచివాలయం పరిధిలోని ముస్లింపేటలో ఇళ్లలోని నీటి తొట్లు, పాడుబడిన కుండలు, ఫ్రిజ్‌లను పరిశీలించారు. నీరు నిలిచి ఉన్న ప్రాంతాల్లో ఎబెట్ ద్రావణాన్ని చల్లించారు. ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు ఆహారం తీసుకునే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో లూర్దురాజు, హెచ్‌ఎస్ అబ్దుల్ రెహమాన్, ఏఎన్‌ఎంలు భారతి, లావణ్య, మాబు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మాస్టిన్ కులస్తులకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం తుమ్మపూడిలో నివసిస్తున్న మాస్టిన్ కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నవ నాగమల్లేశ్వరరావు కోరారు. దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరిని శుక్రవారం కలసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తుమ్మపూడి గ్రామంలో మాస్టిన్ కులస్తులకు (ఎస్సీ) 2020లో కుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారని, అవి ప్రస్తుతం చేయూత పథకానికి పనికి రావని, వాటిని రెన్యువల్ చేసి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, వి.నాగదాసు, వి.వెంకటేశ్వరరావు బి.మోహనరావు, బి.బాపనయ్య, ఎం. మార్తమ్మ, ఎం.ధనలక్ష్మి, పద్మ, అలివేలు, లలితాంబ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని ఉర్దూ పాఠశాల సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో (వీహెచ్‌ఎన్‌డీ)విలేజ్ హెల్త్ న్యూట్రీషన్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, తగిన జాగ్రత్తలు గురించి వివరించారు. 6,7,8,9 నెలల్లో ఎటువంటి ఆహారం తీసుకోవాలి, ఏ సమయాల్లో వ్యాక్సిన్ వేయించుకోవాలనే దానిపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఎఫ్‌ఆర్‌ఎస్ మ్యాప్‌లో భాగంగా గాజుల, రవికగుడ్డ, పాలు, గుడ్లు గర్భిణులకు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ షేక్ బీబీ ఫాతిమా, పి.సుజాత, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, అంతోనిరాణి, సుజాత, పద్మ, శాంతరాణి, జోజమ్మ, శాంతకుమారిలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్కే సొంత నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం




తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పెనుమూలి గ్రామంలో ఎమ్మెల్యే ఆర్కే సొంత నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణలు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పేదలు, దళితులు, మైనార్టీలు, బీసీలు నివసించే ప్రాంతంలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా ఆయన దృష్టికి తీసుకువెళితే వెంటనే ఆ సమస్యకు పరిష్కారం చూపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, పెనుమూలి ఎంపీటీసీ సభ్యురాలు షేక్ సల్మా, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గరిక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు దాతల సహాయం అభినందనీయం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహాయం చేయడం అభినందనీయమని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న ఓపీ కేంద్రంలో ఏసీ మిషన్లు ఏర్పాటు చేసేందుకు శ్రీనివాస మెడికల్ ఎంటర్ ప్రైజెస్ అధినేత రాంబాబు రూ.36వేల చెక్కును ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్, పరిపాలన అధికారి పూసల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుంటూరు ఈస్ట్: గుర్తు తెలియని వ్యక్తి కాలువలో పడి మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. డొంకరోడ్డు మూడువంతెనల సమీపంలోని కాలువలో సుమారు 45 సంవత్సరాల వ్యక్తి పడి మృతిచెంది ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831332కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సురేష్‌కుమార్
- తుళ్లూరులో గడప గడపకు మన ప్రభుత్వం



తుళ్లూరు ఎస్టీ కాలనీలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న కత్తెర సురేష్‌కుమార్

తాడికొండ: ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం తుళ్లూరు ఎస్టీ కాలనీలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకొని సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్ర ద్వారా ప్రతి ఒక్కరి సమస్యలను తెలుసుకొని విద్యార్థుల నుంచి వయో వృద్ధుల వరకు ప్రతి సమస్యకు పరిష్కారం లభించేలా నవరత్నాల పథకాలను రూపొందించి వాటిని విజయవంతంగా అమలు చేశారని కొనియాడారు. ఒక్క రూపాయి అవినీతి లేకుండా సంక్షేమ లబ్ధిని నేరుగా ఖాతాల్లోకి మళ్లించిన ఏకైక సీఎం దేశంలో ఒకే ఒక్కరు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. విశ్వసనీయతే ఆయుధంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన తరువాతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు వెళుతున్నారని, మీలా ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల్లోకి వచ్చి కల్లబొల్లి మాటలు చెప్పే రకం కాదన్నారు. 14 సంవత్సరాల పాలనలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండి అటు రాష్ట్రానికి, ఇటు అమరావతి ప్రాంతానికి ఏం ఒరగబెట్టాడో చెప్పాలని, ఇప్పుడు తన బినామీ ఆస్తులను కాపాడుకునేందుకే అమరావతి పేరుతో ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని తప్పుడు ప్రచారాలు చేసుకుంటున్నాడన్నారు. 5 సంవత్సరాల పాలనలో తాత్కాలిక నిర్మాణాల పేరుతో ఈ ప్రాంతాన్ని నిలువు దోపిడీ చేసింది, కార్పొరేట్‌లకు తక్కువ ధరలకు భూములు కట్టబెట్టి భూములిచ్చిన రైతులను నిలువునా ముంచింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు సీఆర్డీయే చట్టంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంతో పాటు పేదలకు జీవన భృతి పింఛన్లు ఒకటో తేదీనే ఇస్తున్నాడని గుర్తు చేశారు. రాజధాని ప్రాంతంలో పేదలకు కూడా సెంటు జాగా కల్పించేందుకు సీఎం చొరవ చేసుకొని ముందుకెళితే అడ్డుకొని తప్పుడు కేసులు వేయించిన బాబుకు ఈ ప్రాంతంలో పేదలు ఎందుకు మద్దతివ్వాలో చెప్పాలని డిమాండ్ చేశారు. బాబు ఆయన తోక పార్టీలు, దత్త పుత్రుడు కలిసి ఎన్ని అబద్ధాలు వల్లెవేసినా విజ్ఞులైన రాష్ట్ర ప్రజలు మరో 50 సంవత్సరాలు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని గుర్తుంచుకొని మసలుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ఆలోకం సురేష్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల కిషోర్, కొప్పుల శేషగిరిరావు, చనుమోలు రామారావు, నేలపాటి జోగేంద్ర, ఆరేపల్లి జోజి, కంతేటి చిన వెంకటేశ్వర్లు, డీజే శ్రీనివాసరావు, బెజ్జం రాంబాబు, గద్దం జయరావు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం

వైఎస్సార్ సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బాజీ



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బాజీ

మేడికొండూరు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోబోమని ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బాజీ అన్నారు. మండల పరిధిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి టీడీపీ యువగళం పాదయాత్రలో చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. డబ్బు కోసం గెలిపించిన పార్టీకి వెన్నుపోటు పొడిచిన ఘనత ఆమెది అని అన్నారు. నియోజకవర్గంలో ప్రతి పదవికి, ట్రాన్స్‌ఫర్లకు డబ్బులు వసూలు చేయడం వల్లే జగనన్న పార్టీ నుంచి దూరంగా పెట్టారన్నారు. ఇంతటి విష సంస్కృతి ఉన్న మీకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై వ్యాఖ్యలు చేసే హక్కు లేదన్నారు. సమావేశంలో పొట్లపాడు సొసైటీ చైర్మన్ పాములపాటి జయరావు, మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు జి.వి.సుబ్బారెడ్డి, మాజీ వైస్ ప్రెసిడెంట్ జానీ బాషా, సీనియర్ నాయకులు శ్రీహరి, సుబ్బారావు, రాజేంద్రప్రసాద్, నాగేశ్వరరావు, మసీద్ మాలిక్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆర్కే చేయూత



ఇస్త్రీ బండ్లను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి: ఇస్త్రీ చేసుకునే చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చేయూతనందించారు. నగరానికి చెందిన నీలం రాఘవ, పోతురాజు సైదులు, సురభి భవానీలకు స్థానిక నాయకుల ద్వారా శుక్రవారం ఇస్త్రీ బండ్లు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, సంకె సునీత తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పెనుమూలి గ్రామానికి చెందిన చిరువ్యాపారి సయ్యద్ బాజీబాబాకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సహకారంతో ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణలు శుక్రవారం టిఫిన్ బండి అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, పెనుమూలి ఎంపీటీసీ సభ్యురాలు షేక్ సల్మా, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గరిక రమేష్, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), నాయకులు షేక్ నజీర్, ప్రకాష్, గరిక కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్లిష్ట సమస్యల పరిష్కారానికి కృత్రిమ మేధస్సు దోహదం

మోతడక చలపతి ఇంజినీరింగ్‌లో జూమ్ స్పార్క్స్ మ్యాగజైన్ ఆవిష్కరణ



మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

మోతడక(తాడికొండ): ప్రాథమిక, ఉత్పాదక, సేవా రంగాలలో సంక్లిష్ట సమస్యలను పరిష్కరించేందుకు కృత్రిమ మేధస్సు దోహదం చేస్తుందని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె కిరణ్‌కుమార్ అన్నారు. తాడికొండ మండలం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సిటీ టెక్నో స్కార్క్స్ అసోసియేషన్ ఏర్పాటులో భాగంగా జూమ్ స్పార్క్స్ అనే మ్యాగజైన్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏడాదికి ఒకసారి ప్రచురించబడే ఈ మ్యాగజైన్‌లో కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, నూతన సాంకేతిక అంశాలకు సంబంధించిన సమాచారం లభిస్తుందన్నారు. ఈ రంగాలలో రాబోయే రోజుల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి కనుక విద్యార్థులు ఇలాంటి మ్యాగజైన్స్ ద్వారా నూతన సాంకేతిక అంశాలపై మరింత పట్టు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె నాగ శ్రీనివాసరావు, ఏఐఎంఎల్ విభాగాధిపతి ఎస్ శాంతిప్రియ పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువైద్యశాలలో వైద్యున్ని నియమించాలి

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో ఉన్న పశువైద్యశాలలో పశు వైద్యుడిని నియమించాలంటూ ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులతో కలసి శుక్రవారం పశువైద్యశాలను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ చిర్రావూరు గ్రామం మండలంలోనే అత్యధికంగా పాడి పశువులు కలిగి ఉందని, పశువులకు వ్యాధులు వస్తే ప్రైవేటు వైద్యులపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 14 సంవత్సరాల కిందట గ్రామంలో పశువైద్యశాల నిర్మించినప్పటికీ వైద్యుడిని నియమించకపోవడం దారుణమని అన్నారు. తక్షణమే పశువైద్యున్ని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బొప్పన గోపాలరావు, మక్కపాటి రామారావు, మేడూరి పాములు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పరిమిశెట్టి శివనాగేశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు పల్లపాటి సుబ్బారావు, ధనేకుల వేణు, ధనేకుల శ్రీకాంత్, వీరిశెట్టి బాజీ పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు

ఫిరంగిపురం: మండలంలోని పలు ఆలయాల్లో శ్రావణ శుక్రవార పూజలు నిర్వహించారు. అమీనాబాద్‌లోని మూలాంకురేశ్వరి ఆలయంలో అర్చకులు అయ్యన్నశాస్త్రి మూలాంకురేశ్వరి అమ్మవారికి విశేష పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మండలకేంద్రంలోని వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయం, రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం, విజయదుర్గా ఆలయాల్లో అర్చకులు ఆంజనేయశర్మ, వంశీకృష్ణ, రాజేంద్రశర్మలు విశేష పూజలు నిర్వహించారు. దుర్గా అష్టోత్తర, సహస్రనామ కుంకుమార్చనలు చేశారు. పూజల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎంపీపీ పద్మావతి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని, అందరి సహకారంతో అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వి.చంద్రమోహన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండలంలోని ప్రజా ప్రతి నిధులు మండలంలోని అభివృద్ధి పనులపై అధికారులకు తెలియజేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న కాలనీలల్లో ప్రభుత్వం ఇంటి నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టిదని, ఇంటి నిర్మాణాల్లో నిర్లక్ష్యం చేయరాదని సూచించారు.

రోజు ఏదో ఒక సచివాలయాన్ని సందర్శించి, ఇళ్ల నిర్మాణ పనులు ఏ మేరకు జరుగుతున్నాయో తెలుసుకోవాలని హౌసింగ్ ఏఈ సుబ్బారావుకు ఎంపీపీ సూచించారు. ప్రతి సచివాలయం దగ్గర ప్రతి గ్రామంలో నా భూమి- నా దేశం కార్యక్రమంలో భాగంగా 50 మొక్కలు నాటేలా చూడాలన్నారు. కురుస్తున్న వర్షాలు కారణంగా గ్రామంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మండలంలో ఏర్పాటు చేస్తున్న సమావేశాలకు కొందరు అధికారుల గైర్హాజరు కావడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాలకు హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్షాలు ఎక్కువ కురవడం వల్ల పలు గ్రామాల్లో ఓల్టేజీ సమస్యలు, విద్యుత్‌కు సంబంధించిన పలు సమస్యలు అధికంగా ఉన్నాయని వాటిని విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలని విద్యుత్ ఏఈకి ఆదేశించారు. పంట కాల్వలలో తూటి ఆకు వంటి సమస్యలపై అధికారులు పత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రమోహన్, తహసీల్దారు జి, నాంచారయ్య, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు 1 బొల్లిముంత పోతురాజు, 2 అద్దంకి బోసుబాబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తిరోగమన పీఆర్సీ ఒప్పందాన్ని రద్దు చేయాలి

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు లక్ష్మణరావు



రాయపూడి సర్కిల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న నాయకులు

రాయపూడి(తాడికొండ): విద్యుత్ తిరోగమన ఒప్పందాన్ని రద్దుచేయాలని, ఉద్యోగులకు, కార్మికులకు నష్టం చేయాలనే ఉద్దేశ్యంతో పీఆర్సీ ఒప్పందం ఉన్నందున ఉపసంహరించుకోవాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు, ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు బి.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం రాయపూడిలోని సీఆర్డీయే విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా విద్యుత్ ఉద్యోగులు, కార్మికులకు నష్టం చేకూర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ యాజమాన్యం, పవర్ జేఏసీ కుదుర్చుకున్న ఒప్పందం ఇంజినీర్లు, విద్యుత్ ఉద్యోగులు, ఔట్ స్పోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులు, పీస్ రేట్ కార్మికులకు నష్టదాయకంగా ఉందన్నారు. జెఎల్‌ఎం గ్రేడ్-2 లకు ఈ వేతన ఒప్పందం అసలు వర్తించదని, తక్షణమే ఈ వేతన ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ నాయకులు జి పవన్, టి వర్మ, వెంకటస్వామి, సురేష్, నాగవంశీ, రాజేష్, దేవుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- నరసరావుపేట ఎంపీ లావు
- సమస్యలను విన్నవించిన ఎమ్మెల్యే ముస్తఫా



ఎంపీ శ్రీకృష్ణదేవరాయలకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: గుంటూరు నగర పరిధిలోని సమస్యలు ఉన్న ప్రదేశాల్లో ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల ఏర్పాటు చేయటంలో తన వంతు కృషి చేస్తామని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం రింగ్‌రోడ్డులోని ఆయన నివాసంలో పలు సమస్యలపై తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు నూరిఫాతిమా వినతిపత్రం అందజేశారు. గుంటూరులోని నెహ్రూనగర్, మూడు వంతెనల రహదారి దగ్గర, సంజీయ్యనగర్, ఇన్నర్ రింగ్‌రోడ్డు వైపు గడ్డిపాడు వద్ద.. ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీ గుంటూరు డీఆర్‌ఎం రామకృష్ణతో ఫోన్‌లో మాట్లాడారు. వీలైనంత త్వరగా నిర్మాణం జరిగేలా దృష్టి సారించి సహకరించాలని కోరారు. డీఆర్‌ఎం రామకృష్ణ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు వివరించారు. అదే విధంగా నగరంలోని బ్రహ్మానందరెడ్డి స్టేడియం అభివృద్ధిపై చర్చించారు. స్టేడియాన్ని ఖేల్ ఇండియా ద్వారా అభివృద్ధి జరిగేలా కృషి చేస్తామని, వీలైతే తన ఎంపీ నిధులు కేటాయించనున్నట్లు హామీ ఇచ్చారు.

20న సినీ సంగీత విభావరి

పాతగుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈనెల 20న సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు శ్రీ శుభాంజలి కళావేదిక వ్యవస్థాపకుడు మేకల పురుషోత్తమప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సినీనటుడు చిరంజీవి జన్మదినం పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమంలో గాయకులు పాల్గొని చిరంజీవి నటించిన చిత్రాల్లోని పాటలు ఆలపిస్తారన్నారు. భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 21న సినీ సంగీత విభా వరి నిర్వహించనున్నట్లు వేదిక వ్యవస్థాపకుడు మిరియాలప్రసాదరావు తెలిపారు.

గంజాయి వినియోగిస్తున్న వ్యక్తి అరెస్ట్

గుంటూరుఈస్ట్: గంజాయి తీసుకుంటున్న వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్‌లో ఓ వ్యక్తి గంజాయి తీసుకుంటున్నట్లు సమాచారంతో పోలీసులు శుక్రవారం అక్కడకు చేరుకున్నారు. గంజాయితో ఉన్న రాకేష్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో నివాసముండే ఓ బాలిక కనిపించడం లేదంటూ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తాడేపల్లికి చెందిన ఓ బాలిక ఇంటర్ చదివి ఇంట్లోనే ఉంటోంది. లంబాడీపేటకు చెందిన సంతోష్ తీసుకువెళ్లినట్లు బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. బాలిక సంతోష్ దగ్గర ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని, వారిద్దరిని అదుపులోకి తీసుకుని బాలికను తండ్రికి అప్పగిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో ఓ నివాసంలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో ఆ నివాసంపై తాడేపల్లి ఎస్‌ఐ రమేష్ శుక్రవారం దాడి చేసి మొత్తం 12 మందిని అదుపులోకి తీసుకోగా, అందులో నలుగురు మహిళలు ఉన్నారు. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం సీఐ శేషగిరిరావు ఆదేశాల మేరకు తాడేపల్లి ఈఎస్‌ఐ హాస్పిటల్ వద్ద పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో ఆయన ఆదేశాల మేరకు ఆదినారాయణ ఇంటిని తనిఖీ చేశామని మొత్తం 12 మంది పేకాట రాయుళ్లు ఉండగా అందులో నలుగురు మహిళలు ఉన్నారని, వారి వద్ద రూ.17 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీఎస్సీ ఉచిత డెమో క్లాసులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం త్వరలో విడుదల కానున్న డీఎస్సీకి సన్నద్ధమవుతున్న బీఈడీ, డీఎడ్ విద్యార్థుల ప్రయోజనార్థం ఉచిత డెమో తరగతులను నిర్వహించనున్నట్లు విజయసాధన స్టడీ సర్కిల్ డైరెక్టర్ గంగా కిషోర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20, 21, 22వ తేదీల్లో బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల క్యాంపస్‌లో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఉచిత డెమో తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డెమో, రెగ్యులర్ తరగతులకు సంబంధించిన వివరాలకు 0863-2240433, 9293177737 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

20న గద్దర్ సంస్మరణ సభ

తెనాలి: ప్రజాగాయకుడు గద్దర్ సంస్మరణ సభను ఈనెల 20న తెనాలిలో నిర్వహించనున్నారు. ఆరోజు సాయంత్రం 4 గంటలకు అయితానగర్‌లోని పొట్టి శ్రీరాములు కల్యాణ మండపంలో జరిగే సంస్మరణ సభకు న్యాయవాది సంఘాలు, బౌద్ధసంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, కార్మిక సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించినట్లు నిర్వాహకులు తెలియజేశారు.

బహిరంగ ప్రకటన

గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, నూతక్కి గ్రామం, డోర్ నెంబరు 8-154రు కాపురస్థులైన శ్రీ చీడిపూడి వెంకట సుబ్బారెడ్డి గారి కుమారుడు చీడిపూడి సుందరరామిరెడ్డి గారి సంతాయిన్ పొంది యూపస్సంటికి తెలియ జేయునది ఏమనగా నా క్లయింటు తండ్రిగారైన శ్రీ చీడిపూడి వెంకట సుబ్బారెడ్డి గారు ది.07.09.1951వ తేదీన తన స్వార్జితముగా రామచంద్రాపురం గ్రామ డి.నెం. 159/2రు వాడుక య.0-43 సెంట్ల మెరక భూమిని గురించి ది.17-02-2005వ తేదీన ఒక వీలునామా వ్రాయించి శ్రీ మంగళగిరి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం, దస్తావేజు నెంబరు 32/2005దుగా రిజిష్టరు చేయించి ది.10-10-2005వ తేదీన స్వర్గస్థులైనారు. సదరు వీలునామాలోని ఏర్పాట్ల ప్రకారం వారి మరణానంతరం వారి భార్య సరస్వతమ్మ గారి మరణానంతరం వారి కుమారుడైన శ్రీ చీడిపూడి సుందర రామిరెడ్డి గారికి చెందునట్లు ఏర్పాటు చేసియున్నారు. కావున ఈ ప్రకటన గురించి గానీ, ఈ వీలునామాలోని ఏర్పాట్లను గురించిగానీ, వారి బంధువులకు ఎట్టి అభ్యంతరములు ఉన్నయెడల ఈ తేదీ లగాయితు పది రోజులలోపు క్రింది తెలియపర్చిన ఫోన్ నెంబర్లకు తెలియపర్చగలరు. గడువు దాటిన పిదప వచ్చు అభ్యంతరములు పరిగణించబడవు.

యస్. బి. మురళీకృష్ణ
బియస్సీ, యమ్.ఏ, యం.బి.ఎ, బి.యస్, బి.యల్.
అడ్వకేట్, మంగళగిరి.
సెల్ నెంబర్స్: 9440797467, 9848457887

ముని్సపల్ ఉద్యోగులు ఆధార్ అప్డేట్ చేసుకోవాలి

- 23 నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక క్యాంపు
- మేయర్ కావటి మనోహర్ నాయుడు

నెహ్రూనగర్: ఈఎస్‌ఐ సంస్థ నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా గుంటూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి, కార్మికులు వారి ఆధార్ కార్డుతో పాటు కుటుంబ సభ్యుల వివరాలతో అప్డేట్ చేసుకోవాలని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు శుక్రవారం తెలిపారు. నగరపాలక సంస్థలో సుమారు 3 వేల మందికి పైగా పారిశుద్ధ్య కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారని ఉద్యోగులు, కార్మికుల సౌకర్యార్థం అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ ఎండీతో మాట్లాడి ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోనే అప్డేట్ చేసేందుకు స్పెషల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విభాగాల వారీగా కార్మికుల వివరాలు అప్డేట్ చేయడానికి అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ సంస్థ సిబ్బందికి నగరపాలక సంస్థ సిబ్బంది సహకరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అనుమానాస్పద స్థితిలో పారిశుద్ధ్య కార్మికుడి మృతి

తెనాలిరూరల్: అనుమానాస్పదస్థితిలో పారిశుద్ధ్య కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు పట్టణ నందులపేట నరేంద్రదేవ్ కాలనీకి చెందిన ఎర్రంశెట్టి నాగరాజు(40) పారిశుద్ధ్య విభాగంలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. రేపల్లెలో బంధువుల ఇంట్లో జరిగిన శుభ కార్యానికి భార్యాపిల్లలతో గురువారం వెళ్లి తిరిగి రాత్రికి తెనాలి చేరుకున్నారు. భార్యాపిల్లలను ఇంటికి వెళ్లమని పంపి అతను బజారులోనే ఆగిపోయాడు. కొద్దిసేపటికి భార్య ఫోన్ చేయగా ఇంటికి వస్తున్నట్టు చెప్పాడుగానీ వెళ్లలేదు. శుక్రవారం ఉదయం ఇంటి సమీపంలోని ఓ సందులో పడి మృతి చెంది ఉన్నాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న టూ టౌన్‌పోలీసులు ఘట నాస్థలాన్ని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి సాయిబాబా గుడి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం.. విజయవాడ కేదారేశ్వరపేటకు చెందిన రామకృష్ణ ఇంటి వద్ద నుంచి తన ద్విచక్రవాహనంపై మంగళగిరి వెళుతున్నాడు. సాయిబాబా గుడి వద్దకు రాగానే ద్విచక్రవాహనానికి కుక్క అడ్డురావడంతో తప్పించబోయి రోడ్డు మధ్యలోకి వచ్చాడు. వెనుక నుంచి వస్తున్న కారు ఢీ కొట్టడంతో రామకృష్ణ రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కాగా, ఒక కాలు విరిగింది, నడుముకు కూడా తీవ్రంగా దెబ్బతగిలింది. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో బాధితుడిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి బంధువులకు సమాచారం ఇచ్చారు. ఈ సంఘటనపై తాడేపల్లి ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
90100 67114 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com